

పెద్ద పెండ్యాలలో పేట్రేగిన ఇసుక మాఫియా

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -55 మంగళవారం 28 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు 4 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## గందరగోళం మధ్యే సభ ముందుకు

# పేపర్ లీకేజ్ సవరణ బిల్లు

**పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన - మోడీ, అమిత్ షాల క్షమాపణలకు పట్టు**

**బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ -బిల్లు ప్రాధాన్యం దృష్ట్యా చర్చకు అనుమతించిన స్పీకర్**





**న్యూఢిల్లీ,జూలై 27 (జర్నలిస్ట్ వార్త):**
పార్లమెంట్ ఉభయసభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో **మిగతా 2లో...**

## ఎల్‌నినోపై అవగాహన

# కల్పించండి

**: సీఎం చంద్రబాబు ఆదేశాలు**



**ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్న సీఎం**

**ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచన**

**ప్రజల అంచనాలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలని స్పష్టీకరణ**

**విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం నిపుణుల సేవలు తీసుకోవాలని ఆదేశం**

**పనితీరుపై క్షేత్రస్థాయి అభిప్రాయాలను అధికారులకు వివరించిన సీఎం**

**అమరావతిజూలై 27 (జర్నలిస్ట్ వార్త):**
ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండనుందన్న అంచనాల నేపథ్యంలో, రైతులను అప్రమత్తం చేసి వారికి పూర్తిస్థాయిలో అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రచార **మిగతా 2లో...**

## మళ్లీ ఆందోళన

# చేపడతాం

**కేంద్రం ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోంది**

**కొనసాగుతున్న పోలీసు చర్యపై కేంద్రానికి సీజేపీ అల్టిమేటం**



**న్యూఢిలీజూలై 27 (జర్నలిస్ట్ వార్త):**
కేంద్ర ప్రభుత్వం ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని, అలాగైతే మళ్లీ ఆందోళన చేపడతామని కొనసాగుతున్న పోలీస్ చర్యపై కేంద్రానికి సీజేపీ అల్టిమేటం జారీ చేసింది. విద్యార్థుల నేతృత్వంలో జరిగిన ఆందోళనలో నిరసనకారులను నిర్బంధించడం, అరెస్టు చేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, వారికి న్యాయపరమైన మద్దతు అందించడానికి, సాక్ష్యాలను భద్రపరచడానికి చర్యలు తీసుకుంటున్నట్టు సీజేపీ ప్రతినిధులు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ తెలిపారు. సోమవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో కలిసి వారు మాట్లాడారు. నిరసనలకు సంబంధించిన అసలైన ఫొటోలు, వీడియోలను ట్యాంపర్-ఎవిడెంట్ సాక్ష్యంగా భద్రపరచడానికి, అలాగే న్యాయ సహాయ బృందాలు వాటిని ఉపయోగించుకోవడాన్ని సులభతరం చేయడానికి **మిగతా 2లో...**

# ఆరు పాయింట్ల ఫార్ములాపై ఆరా ..



**తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాలపై ఏఐసీసీ సమావేశం**

**హాజరైన సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**రాష్ట్రంలో పార్టీ బలోపేతం, పార్టీ నిర్మాణం,**

**సంస్థాగత అంశాలపై సమాలోచనలు**

**తెలంగాణలో చేపడుతున్న కార్యక్రమాలపై అధిష్టానానికి వివరణ**

**పలు అంశాలపై నివేదిక అందజేసిన పీసీసీ అధ్యక్షుడు**

**న్యూఢిల్లీ : జూలై 27 (జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ అధిష్ఠానం నిర్దేశించిన ఆరుపాయింట్ల ఫార్ములాపై తెలంగాణకు చెందిన నాయకులతో ఏఐసీసీ చర్చించింది. ఈ మేరకు ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌లు సమావేశం అయ్యారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, పార్టీ-ప్రభుత్వం **మిగతా 2లో...**



# తక్కువ ధరలకే

# నాణ్యమైన బియ్యం

**ఆగస్ట్ 1 నుంచి రాష్ట్రంలో అమలు**

**డిసప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి**

**అమరావతి,జూలై 27 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుడ్ న్యూస్ చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఏపీ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరగనున్నట్లు పవన్ పేర్కొన్నారు.

# ఏం చేసారో చేయండి.. మా పెద్దిని కాపాడండి

యశోద వైద్యులను వేడుకున్న కేసీఆర్

-కుటుంబ సభ్యులకు భరోసా..

చికిత్సపై క్షుణ్ణంగా ఆరా

2లో.



# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు**

**ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం**

**అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సిఎం భట్టి**



**ఖమ్మం,జూలై 27 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. **మిగతా 2లో...**

## హైడ్రా కమిషనర్‌ను

# తొలగించండి

**పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం**

**ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు**

**లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ**

**కోర్టులంటే గౌరవం :క్షమాపణలు కోరిన రంగనాథ్**



**హైదరాబాద్,జూలై 27 (జర్నలిస్ట్ వార్త):**
హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది **మిగతా 2లో...**

## సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

**కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు**



**న్యూఢిల్లీ,జూలై 27 (జర్నలిస్ట్ వార్త):**
గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా **మిగతా 2లో...**

# గందరగోళం మధ్యే సభ ముందుకు పేపర్ లీకేజ్ సవరణ బిల్లు

**మొదటిపేజీ తరువాయి**

ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా విపక్షాలు ముందుకు రాలేదు. నీట్-యూజీ సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణల తో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి..

పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు.

కాగా.. పరీక్షల అక్రమాలపై కేంద్రం ఇప్పటికే పాలనాపరమైన చర్యలు ప్రారంభించింది. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)లో 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. అలాగే పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో సంస్కరణలు, సాంకేతిక భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది.

# ఏం చేస్తారో చేయండి.. మా పెద్దిని కాపాడండి

**యశోద వైద్యులను వేడుకున్న కేసీఆర్ -కుటుంబ సభ్యులకు భరోసా.. చికిత్సపై క్షుణ్ణంగా ఆరా**

**హైదరాబాద్/నర్సంపేట,జులై 27 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) సోమవారం ఆస్పత్రికి చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులను ఉద్దేశించి ఏం చేస్తారో చేయండి.మా పెద్దిని కాపాడండి అంటూ భావోద్వేగంగా విజ్ఞప్తి చేశారు.ఆస్పత్రిలో దాదాపు అరగంటపాటు వైద్యులతో సమావేశమైన కేసీఆర్. చికిత్స తీరుపై సవివరంగా ఆరా తీశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డికి అత్యాధునిక వైద్యం అందిస్తున్నామని, ఆరోగ్య పరిస్థితిపై స్పష్టమైన సమాచారం వెల్లడించేందుకు మరో 48 గంటలు అవసరమని వైద్యులు వివరించినట్లు తెలిసింది.ఐసీయూలో కొనసాగుతున్న వైద్య చికిత్సను పరిశీలించిన అనంతరం కేసీఆర్ కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. దేవుడున్నాడు.డాక్టర్లు ఉన్నారు. అన్నీ సవ్యంగానే జరుగుతాయి. ధైర్యంగా ఉండండి



అంటూ వారికి భరోసా కల్పించారు. చికిత్స ఖర్చు విషయంలో ఎలాంటి వెనుకంజ ఉండదని, పెద్ది సుదర్శన్‌రెడ్డి కోలుకునే వరకు పార్టీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.గుండెపోటుతో అస్వస్థతకు గురైన పెద్ది సుదర్శన్‌రెడ్డిని మెరుగైన చికిత్స కోసం యశోద ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆయన త్వరగా కోలుకోవాలని వరంగల్ జిల్లాతో పాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, యజ్ఞాలు నిర్వహిస్తున్నారు. మంత్రి సీతక్క సైతం ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

# మళ్లీ ఆందోళన చేపడతాం

**మొదటిపేజీ తరువాయి**

రూపొందించిన 'సాక్షి' అనే వెబ్‌సైట్, అప్లికేషన్‌ను కూడా సీజేపీ ప్రవేశపెట్టింది.విలేకరుల సమావేశంలో సౌరవ్ దాస్ మాట్లాడుతూడ 36 రోజుల ఆందోళనను ఉపసంహరించుకున్న తర్వాత నిరసనకారులు చర్యలను ఎదుర్కోవచ్చనే ఆందోళనల నేపథ్యంలో సీజేపీ.. కపిల్ సిబల్‌తో సంప్రదింపులు జరుపుతూనే ఉందని, ఆయన న్యాయ సలహా కోరిందని తెలిపారు. "మేము కపిల్ సిబల్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, న్యాయ సలహా కూడా తీసుకున్నాం. 25న మేము నిరసనను విరమించుకున్నప్పుడు, భవిష్యత్తులో ఈ ఉద్యమం సద్దుమణిగిన తర్వాత ప్రభుత్వం నిరసనకారులను లక్ష్యంగా చేసుకోవడం ప్రారంభిస్తుందేమోనని మాకు అనుమానం కలిగింది. ఇది చాలా విశ్వసనీయమైన అనుమానం. ఎందుకంటే ఇతర ప్రధాన నిరసనలలో కూడా ఇదే తరహా వ్యూహాన్ని అనుసరించడం గమనించాం. అక్కడ వ్యక్తులను ప్రత్యేకంగా గుర్తించి, వారిపై తప్పుడు కేసులు బనాయించారు. మొదటి రోజు నుంచే విద్యార్థులందరికీ న్యాయ, వైద్య సహాయం అందించడంతో పాటు, దేశవ్యాప్తంగా వారికి మద్దతు అందేలా న్యాయవాదులతో సమన్వయం కూడా ఏర్పాటు చేశాం" అని ఆయన తెలిపారు.

నిరసనకారులు, సాక్షులు ప్రదర్శనల నుంచి ఫొటోలు, వీడియోలను సాక్ష్యంగా భద్రపరచుకోవడంలో సహాయపడే లక్ష్యంతో 'సాక్షి' అనే వెబ్‌సైట్‌ను సీజేపీ ప్రతినిధులు పరిచయం చేశారు. ఈ ప్లాట్‌ఫారమ్ వినియోగదారులకు అసలైన నిరసన ఫుటేజీని అప్‌లోడ్ చేయడానికి అనుమతిస్తుందన్నారు. ట్యాంపర్-ఎవిడెంట్ రికార్డును సృష్టించడానికి ప్రతి ఫైల్‌కు క్రిప్టోగ్రాఫిక్ ఫింగర్‌ప్రింట్‌ను రూపొందిస్తుందని తెలిపారు. ఆ తర్వాత, హక్కుల ఉల్లంఘన ఆరోపణలను ఎదుర్కొంటున్న నిరసనకారులకు మద్దతు ఇవ్వడానికి, భద్రపరిచిన ఈ మెటీరియల్‌ను ధృవీకరించబడిన న్యాయ సహాయ మార్గాలతో పంచుకోవచ్చని అన్నారు. ఫోన్ స్వాధీనాలు, తొలగించబడిన చాట్‌లు, గడువు ముగిసిన లింక్‌లతో సాక్ష్యాలు మాయం కాకుండా నిరోధించడానికి, అలాగే న్యాయ బృందాలు అసలు ఫుటేజ్‌ను దాని మూలానికి సంబంధించిన స్పష్టమైన రికార్డుతో యాక్సెస్ చేయడానికి సహాయపడటానికి సాక్షిని సృష్టించామని అన్నారు.

విద్యార్థులు, ఇతర నిరసనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోకపోయినా, అరెస్టయిన వారిని విడుదల చేయకపోయినా తమ సంస్థ నిరసనను పున:ప్రారంభించవచ్చని అశుతోష్ రాంకా హెచ్చరించారు. కేంద్ర మంత్రులు జెపి నడ్డా, జితేంద్ర సింగ్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ నిరసనకారులపై ఎలాంటి శిక్షా చర్యలు ఉండవని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేశారని, మరికొందరిని ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో నిర్బంధిస్తున్నారని, వేధిస్తున్నారని ఆయన వివరించారు. "నిరసనకారులపై పోలీసు చర్యలు తీసుకోకూడదనే ఒప్పందాన్ని పూర్తిగా ఉల్లంఘించడాన్ని మేం గమనిస్తున్నాం. బీహార్, బెంగాల్‌లలో వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేశారు. ఢిల్లీ, ఇతర రాష్ట్రాలలో వందలాది మందిపై నిఘా, వేధింపులు జరుగుతున్నాయి. నిరసనకారులకు లాజిస్టిక్స్‌తో మద్దతు ఇస్తున్న వాలంటీర్లను ఢిల్లీలో నిర్బంధించినట్టు పలు నివేదికలు వెలువడుతున్నాయి" అని ఆయన పేర్కొన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే సీజేపీ మళ్లీ నిరసన చేపట్టాల్సి వస్తుందని అన్నారు. "నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, విద్యార్థులను విడుదల చేయాలని, అలాగే మా ఒప్పందానికి అనుగుణంగా ఢిల్లీ పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు, బీజేపీ మిత్రపక్ష రాష్ట్రాల పోలీసులు భవిష్యత్తులో ఎలాంటి ఎఫ్ఐఆర్‌లూ నమోదు చేయకుండా చూడాలని మేము డిమాండ్ చేస్తున్నాం. అలా చేయడంలో విఫలమైతే, మేం మళ్లీ నిరసనకే పరిమితం కావాల్సి వస్తుంది" అని తెలిపారు. చట్టపరమైన కేసులకు సంబంధించిన లిఖితపూర్వక ఒప్పందాన్ని, కేంద్ర ప్రభుత్వంతో ఏకీభవించిన కాలపరిమితులను రేపటిలోగా మాతో పంచుకోవాలని కూడా మేము డిమాండ్ చేస్తున్నామని చెప్పారు.

# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

**మొదటిపేజీ తరువాయి**

కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

# ఎల్‌నినోపై అవగాహన కల్పించండి

**మొదటిపేజీ తరువాయి**

కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఆయన వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. "ఎల్‌నినో వల్ల ఎదురయ్యే పరిణామాలను రైతులకు స్పష్టంగా వివరించాలి. ఏ ప్రాంతంలో ఏ పంటలు వేయాలో సూచిస్తూ, వారిని ప్రత్యామ్నాయ సాగు వైపు ప్రోత్సహించాలి. దీనికోసం ఒక క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు ప్రజల ఆలోచనలకు అనుగుణంగా మారాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు అందడంలో కొంత అంతరం కనిపిస్తోందని అన్నారు. ఇటీవల ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరుపై ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను ఆయన అధికారుల వద్ద ప్రస్తావించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, దానికి తగ్గట్టుగా ఉద్యోగులు పనిచేయాలని హితవు పలికారు.రంపచోడవరం విద్యార్థిని శివాని ఆత్మహత్య ఘటనపై సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చదువులో టాపర్‌గా ఉన్న విద్యార్థిని చనిపోవడం బాధాకరమని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసేందుకు సైకో మెట్రిక్ టెస్టులు నిర్వహించాలన్న విద్యాశాఖ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని సూచించారు. ఇందుకోసం నిపుణుల సేవలు తీసుకోవడంతో పాటు, ఉపాధ్యాయులకు కూడా అవసరమైన శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

**మొదటిపేజీ తరువాయి**

బీపీటీ బియ్యం కేజీ రూ.52, పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందజేయడంతో సామాన్యులకు ఊరట లభించనుందని తెలిపారు. ఏపీ ప్రజలకు అండగా ఉండేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంవో కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. 'కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా ఏపీ పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యులకు సాంత్వన చేకూర్చేలా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టడం హర్షణీయం. ఆగస్టు 1 నుంచి ఏపీలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో బియ్యం అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. బీపీటీ సూపర్ ÷న్ బియ్యం కేజీ రూ.52కు, గ్రేడ్-1 పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందించనున్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. సామాన్యులపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నా. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్షించి, మిల్లర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించాం. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనాపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని విశ్వసిస్తున్నా' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ఆరు పాయింట్ల ఫార్ములాపై ఆరా ..

**మొదటిపేజీ తరువాయి**

మధ్య సమన్వయం, ఎస్ఐఆర్ అమలు తీరు వంటి కీలక అంశాలపై దిల్లీలో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ సంస్థాగత నిర్మాణం, పార్టీ కార్యక్రమాలు, పార్టీ బలోపేతం, పార్టీ-ప్రభుత్వం మధ్య సమన్వయం, ఎస్ఐఆర్ అమలు తీరు, క్షేత్రస్థాయి పార్టీ కార్యకలాపాలపై రాష్ట్ర నాయకత్వం అధిష్ఠానానికి వివరించింది. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ స్థాయి నుంచి పోలింగ్ బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసేందుకు చేపడుతున్న చర్యలను కేసీ వేణుగోపాల్‌కు తెలిపారు. పార్టీ బాధ్యతల అప్పగింత, శిక్షణ కార్యక్రమాలు, సంస్థాగత క్రమశిక్షణ, సమావేశాల నిర్వహణ, అనుసంధాన కేంద్రాల పనితీరు సమీక్ష, కాంగ్రెస్ కనెక్ట్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ వినియోగం వంటి అంశాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమగ్ర నివేదికను అధిష్ఠానానికి సమర్పించారు.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

**మొదటిపేజీ తరువాయి**

అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# దేవాదుల జలాలతో ధర్మసాగర్ ఉత్తర కాలువకు నీటి విడుదల

### కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు చేతుల మీదుగా

### ఆరుదడి పంటలు కాపాడుకోండి.. వరి సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోండి







**ధర్మసాగర్ /హనుమకొండ, బ్యూరో జూలై 27 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ధర్మసాగర్ చెరువుకు తరలించిన గోదావరి జలాలను సోమవారం ఉత్తర కాలువ (నార్త్ కెనాల్) ద్వారా విడుదల చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కలిసి గేట్లు ఎత్తి సాగునీటిని విడుదల చేశారు. గోదావరి జలాలకు పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఎల్‌నీనో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనగా, శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, నిజాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండీ) వంటి ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు సాగు చేసిన ఆరుదడి పంటలను కాపాడేందుకే దేవాదుల ద్వారా గోదావరి జలాలను ధర్మసాగర్‌కు తరలించి కాలువల ద్వారా విడుదల చేస్తున్నట్లు చెప్పారు.దేవాదుల ఆయకట్టు ప్రాంత ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించి వెంటనే నీటి విడుదలకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ప్రస్తుతం ధర్మసాగర్ నుంచి ఉత్తర, దక్షిణ కాలువలతో పాటు దేవాదుల మూడో దశ పైప్‌లైన్ ద్వారా కూడా సాగునీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.రైతులు ఇప్పటికే సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, వేరుశెనగ తదితర ఆరుదడి పంటలను ఈ నీటితో రక్షించుకోవాలని సూచించారు. వరి సాగు చేయొద్దని చెప్పడం లేదని, అయితే వరి పంటకు అధిక నీటి అవసరం ఉన్నందున ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఒకటికి రెండుసార్లు ఆలోచించి మాత్రమే సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. మధ్యలో నీటి సరఫరా నిలిచిపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రస్తుతం కాలువల ద్వారా పది రోజుల పాటు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నామని, అనంతరం నీటి లభ్యతను బట్టి మరో విడత నీరు అందిస్తామని తెలిపారు. చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా గ్రామాల వారీగా వంతుల పద్ధతిలో సాగునీటిని



వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. తప్పుడు ప్రచారాలను నమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని కోరారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం సాధ్యమైనంత మేర గోదావరి జలాలను వినియోగిస్తూ అన్ని చర్యలు చేపడుతోందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తాసిల్దార్ బావ్ సింగ్, ఎంపీడీవో అనిల్ కుమార్. గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా , వరంగల్ మార్కెట్ డైరెక్టర్ బొడ్డుకుమార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుర్రపు ప్రసాద్, ధర్మసాగర్ మండలం అధ్యక్షులు పెసరు రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

# మాట్ల మొండయ్య సేవలు అభినందనీయం

### - వంగర ఎస్ఐ దివ్య



**భీమదేవరపల్లి/జూలై27 (జర్నలిస్ట్ వార్త):** బావులు, చెరువుల్లో ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి మృతదేహాలను నీటి నుంచి వెలికితీయడంలో పోలీసులకు ఎప్పటికప్పుడు సహకరిస్తున్న వంగర గ్రామానికి చెందిన మాట్ల మొండయ్య సేవలు అభినందనీయమని వంగర ఎస్ఐ దివ్య అన్నారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్ల మొండయ్యను శాలువాతో ఘనంగా సన్మానించి మాట్లాడిన ఎస్ఐ దివ్య, ప్రాణాలకు తెగించి క్లిష్ట పరిస్థితుల్లోనూ మృతదేహాలను వెలికితీసి పోలీసులకు సహకరించడం గొప్ప మానవతా సేవ అని కొనియాడారు. ఇలాంటి సేవా దృక్పథం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్ల మొండయ్యకు పోలీసు శాఖ తరపున అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే సేవా భావంతో ప్రజలకు, పోలీసులకు సహకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వంగర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ర

# విత్తనమేళాకు శ్రీకారం

### నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలి :సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 27(జర్నలిస్ట్ వార్త):** ఖరీఫ్ సాగును దృష్టిలో ఉంచుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు ధర్మసాగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన విత్తనమేళాను ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా మాట్లాడుతూ రైతులు ధృవీకరించిన, నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి సాగు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తున్న సాంకేతిక సూచనలను పాటించడం ద్వారా పంట దిగుబడులను పెంచుకోవచ్చని అన్నారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వ్యవసాయ శాఖ అధికారులు వివిధ రకాల పంటలకు అనువైన విత్తనాలు, విత్తన శుద్ధి, ఎరువుల సమతుల వినియోగం, చీడపీడల నివారణ, శాస్త్రీయ సాగు పద్ధతులపై రైతులకు వివరించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తింపు పొందిన కేంద్రాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.

విత్తనమేళాలో వివిధ రకాల ధృవీకరించిన విత్తనాలను ప్రదర్శించడంతో పాటు రైతులకు వాటి ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రాజేష్ సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమాజ సేవకే జీవితాన్ని అంకితం చేసిన మల్లూరు

### మొదటి వర్ధంతి సందర్భంగా సీపీఎం నేతల ఘన నివాళి

### ఆదర్శ జీవితం నేటి తరానికి స్ఫూర్తి: నాయకులు

**సత్తుపల్లి/జూలై 27 (జర్నలిస్ట్ వార్త):** సమాజ సేవ కోసం తన కుటుంబంలోని పెద్ద కుమారుడిని సీపీఎంకు అంకితం చేసిన అమరజీవి మల్లూరు వెంకట సత్యనారాయణ సేవలు చిరస్మరణీయమని సీపీఎం నాయకులు కొనియాడారు. ఆయన మొదటి వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులోని కర్మల భవన్‌లో ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు మాట్లాడుతూ అంగవైకల్యం ఉన్నప్పటికీ దానిని లెక్కచేయకుండా వేలాది కిలోమీటర్లు కాలినడకన తిరుగుతూ కార్మికులు, కూలీల మధ్య చిరు వ్యాపారం చేసి



జీవనం సాగించిన మహోన్నత వ్యక్తి మల్లూరు వెంకట సత్యనారాయణ అని అన్నారు. అవినీతికి దూరంగా, ఎవరికి హాని చేయకుండా నిరాడంబరంగా జీవించిన ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మెరుగు సత్యనారాయణ, సీపీఎం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడుతూ ఆస్తులు కూడబెట్టడం కాకుండా విలువలతో కూడిన జీవితాన్ని గడిపిన వ్యక్తి మల్లూరు అని కొనియాడారు. ఆయన ఆలోచనలు, నిరాడంబర జీవనం సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. సత్తుపల్లి ప్రాంత ప్రజల మనసుల్లో ఆయన చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు.అనంతరం మల్లూరు వెంకట సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి పిడికిలి బిగించి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మల్లూరు పద్మావతి, మల్లూరు చంద్రశేఖర్, మల్లూరు మోహన్, గుమస్తాల సంఘం అధ్యక్షుడు అల్లంశెట్టి రాంబాబు, రత్నాకర్, మోహన్, జర్నలిస్టులు ఆరెంపుల హరిబాబు, తోట నాని, పోట్రూ రామారావు, తిమ్మిడి రాంబాబు, చల్లగుల్ల అప్పారావు, పలగాని రమ్య, ఉండవల్లి శ్రీకాంత్, డంకర శ్రీను, బూరుగు శ్రీదేవి, సోనాక్షి, తుంగా నాగరాజు, కోటి, టోపీ శ్రీను, బంధుమిత్రులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల బకాయి ఖర్చులు విడుదల చేయాలి

### తల్లాడ మండల గ్రామపంచాయతీల విజ్ఞప్తి

**తల్లాడ/ జూలై 27 (జర్నలిస్ట్ వార్త):**




గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు చేసిన ఖర్చులకు సంబంధించిన బకాయి నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తల్లాడ మండలంలోని గ్రామపంచాయతీల ప్రతినిధులు కోరారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో గత డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించగా, వాటి నిర్వహణకు మొత్తం రూ.29,83,497 వ్యయం అయిందన్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు తల్లాడ మండలానికి రూ.20,69,196 మాత్రమే విడుదల చేసిందని తెలిపారు. ఇంకా రూ.9,14,301 బకాయిలు విడుదల కావాల్సి ఉందన్నారు.ఎన్నికల నిర్వహణ కోసం ముందుగా ఖర్చు చేసిన నిధులు తిరిగి అందక గ్రామపంచాయతీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే మిగిలిన బకాయి నిధులను విడుదల చేసి గ్రామపంచాయతీలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండల ప్రజాపరిషత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

# హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌పై సీపీ శ్వేత ఆకస్మిక తనిఖీ

### ఫిర్యాదుదారులకు రశీదు తప్పనిసరి.. రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

**హసన్ పర్తి /జూలై 27 ( జర్నలిస్ట్ వార్త):**




వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సోమవారం సెంట్రల్ జోన్ పరిధిలోని హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న సీపీకి ఇన్‌స్పెక్టర్ మహేందర్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు.స్టేషన్ పరిసరాలు, నిర్వహణ, రికార్డులు, అధికారులు, సిబ్బంది పనితీరును సీపీ పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాలు, గ్రామాల పరిస్థితులు, శాంతిభద్రతల నిర్వహణపై ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదగా వ్యవహరించాలని, స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు తప్పనిసరిగా రశీదు అందజేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించాలని, మహిళలపై జరిగే నేరాలపై తక్షణమే స్పందించాలని, చోరీలను అరికట్టేందుకు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. నమోదైన కేసుల దర్యాప్తును నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

# కొత్తపేట రైతు వేదికలో వైభవంగా విత్తన మేళా ప్రారంభం.





**బయ్యారం/,జులై 27.(జర్నలిస్ట్ వార్త)ద:**బయ్యారం మండలం కొత్తపేట రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళాను వ్యవసాయ అధికారి కే.రాజు సోమవారం ప్రారంభించారు.విత్తనాల విక్రయం నేటి నుంచి మూడు రోజుల పాటు జరగనుందని తెలిపారు.ఎల్‌నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం,కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించేందుకు పెసర,కంది, మినుము వంటి ఐడి పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఫయాజ్,నాగరాజు,అఖిల్ పాల్గొని రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాల వివరాలు రైతులకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఏఓ రాజు మాట్లాడుతు మార్కెట్‌లో నకిలీ విత్తనాల బారిన పడకుండా ప్రభుత్వ గుర్తింపు పొందిన కేంద్రాల నుంచే విత్తనాలు సేకరించాలని, కొనుగోలు రసీదులను భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు.ఎల్నినో కారణంగా వర్షాభావ పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున తక్కువ కాల పరిమితి తో చేతికొచ్చే,ప్రభుత్వం బోనస్ ఇచ్చే 7 రకాల వరి విత్తనాలు మాత్రమే రైతులు పండించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రైతులు,విత్తన డీలర్లు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ జలాలతో రైతులకు ఊరట

### సౌత్ కెనాల్ ద్వారా సాగునీటి విడుదల -రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వమే ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**ధర్మసాగర్ /హనుమకొండ, బ్యూరో జూలై 27 (జర్నలిస్ట్ వార్త):** వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఊరట కల్పించేందుకు ధర్మసాగర్ రిజర్వాయర్ సౌత్ కెనాల్ ద్వారా సోమవారం సాగునీటిని విడుదల చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కాలువ గేట్లను ఎత్తారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ఎల్‌నీనో ప్రభావంతో వర్షాలు కురవక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సాగునీటి కొరత లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్‌లోని నీటిని హసన్‌పర్తి, ఐనవోలు, వర్ధన్నపేట మండలాల రైతులకు అందించేందుకు సౌత్ కెనాల్ ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు.రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లోని నీటి నిల్వలను దృష్టిలో



ఉంచుకుని నీటిని విడుదల చేస్తున్నామని, రానున్న రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిస్తే సాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగుతుందని చెప్పారు. ఈ నీటి విడుదలతో సౌత్ కెనాల్ ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజలకు, రైతులకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం



అమలు చేస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్, హరీశ్‌రెడ్డి, సదానందం, శ్రీకాంత్, శంకర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రైతు రాజు, విసం సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, దువ్వ నవీన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు కలెక్టరేట్‌లో గ్రామస్తుల పోరాటం

### మృతుల పేర్లపై నమోదైన భూములపై విచారణకు డిమాండ్

**హసన్ పర్తి/జూలై 27 (జర్నలిస్ట్ వార్త):** ఎల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ భూములను భూ కబ్జాల నుంచి రక్షించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం గత కొంతకాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా 65వ డివిజన్‌కు చెందిన వెలిశోజు బుచ్చిరాములు మాట్లాడుతూ.. గ్రామంలోని 246వ సర్వే నంబరు భూమికి సంబంధించి పట్టాదారులుగా నమోదైన మండబజారు, మండ నాంపల్లి, దుస్స దుర్గయ్యలు ఏళ్ల కిందటే మృతి చెందారని తెలిపారు. మండబజారు సుమారు 20 సంవత్సరాల క్రితం, మండ నాంపల్లి 15 సంవత్సరాల క్రితం, దుస్స దుర్గయ్య 18



సంవత్సరాల క్రితం మృతి చెందినప్పటికీ వారి పేర్లపై నమోదులు ఎలా కొనసాగాయో అనుమానాలు వ్యక్తం చేశారు.ఈ విషయమై గతంలో హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయానికి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోగా, సంబంధిత ఫైళ్లు, రికార్డులు ఉంటేనే సమాచారం అందిస్తామని అధికారులు సమాధానం ఇచ్చారని తెలిపారు. దీంతో పూర్తి వివరాలు అందించాలని కోరుతూ కలెక్టర్‌కు మరోసారి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

మృతి చెందిన వ్యక్తులకు కేవైసీ, ఆధార్ వంటి వివరాలు లేకపోయినా వారి పేర్లపై నమోదులు ఎలా జరిగాయో సమగ్రంగా విచారించాలని, ఇందుకు బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడి ప్రజా ఆస్తులను పరిరక్షించాలని కలెక్టర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో నేదునూరి సునీల్, గంగిళ్ల వెంకట్‌రెడ్డి, రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# కార్గిల్ వీరులకు భీమారంలో అశ్రునివాళి

## కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి.. యువత సైన్యంలో చేరాలని పిలుపు






**హసన్ పర్తి /జులై 27 (జర్నలిస్ట్ వార్త):** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భీమారం 55వ డివిజన్ బస్టాప్ వద్ద తెలంగాణ ఉద్యమకారుడు ఆకుల కుమార్ ఆధ్వర్యంలో కార్గిల్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి వీర జవాన్ల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆకుల కుమార్ మాట్లాడుతూ.. 1999 కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి శత్రువులను మట్టికరిపించి కార్గిల్ శిఖరాలపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారని గుర్తు చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను ప్రతి భారతీయుడు స్మరించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను ప్రతి ఏడాది నిర్వహించడం ద్వారా వారి త్యాగాలకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. నేటి యువత దేశభక్తిని మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని, అధిక సంఖ్యలో భారత సైన్యంలో చేరి దేశ సేవకు అంకితమవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బండారి సుభాష్, నాయకపు శ్రీనివాస్, గుంజ సాయికుమార్, బూర శరత్, ఆకుతోట ప్రకాష్, చెట్లపల్లి భాస్కర్, బాలగోని రమేష్, ఆకుల రాహుల్, సంఘాల సునీల్, ఉప్పు రమేష్, నాయకపు రాధాకృష్ణ, మాజీ ఆర్మీ జవాన్లు రాతిపల్లి రాజు, సురేంద్రనాథ్, గోపతి రామ్ నరేష్, అలాగే స్థానిక యువకులు ఆకుల రోహిత్, సంఘాల క్రాంతి, అభిషేక్, సుప్రతిక్, ఆకుల ధర్మ, తేజ, సూర్యతేజ, విష్ణు పాండే, బూర వరుణ్, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ

## దాత మాడిశెట్టి సంపత్ సేవలు ఆదర్శనీయం సర్పంచ్ బిల్లా యాదగిరి






**వేలేరు/ జులై 27(జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల్లో విద్యాభ్యాసంపై ఆసక్తి పెంపొందించాలనే ఉద్దేశంతో వేలేరు గ్రామానికి చెందిన దాతలు మాడిశెట్టి సంపత్‌సోమలక్ష్మి దంపతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. నిర్వహించిన కార్యక్రమానికి వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది దాదాపు రూ.50 వేల విలువైన నోట్ పుస్తకాలను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేస్తూ విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న మాడిశెట్టి సంపత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని, ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. పాఠశాలలో చదువుతున్న 218 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారిని కూడా ప్రోత్సహిస్తామని సర్పంచ్ తెలిపారు. అనంతరం నోట్ పుస్తకాల దాత మాడిశెట్టి సంపత్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, ప్రధానోపాధ్యాయుడు సత్యం, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వర్షాభావానికి ప్రత్యామ్నాయమే మార్గం

## వర్ధన్నపేట రైతు వేదికలో విత్తన మేళా ఘనం- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన

**వర్ధన్నపేట/జులై 27 (జర్నలిస్ట్ వార్త):** వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం వర్ధన్నపేట రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమం రైతుల విశేష స్పందన మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వివిధ విత్తన, ఎరువుల సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పెసర, కంది, మినుములు, బొబ్బర్లు వంటి పప్పుధాన్యాలతో పాటు చిరుధాన్యాలు, ఇతర ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రైతులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా నరకుడు వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, తక్కువ నీటితో అధిక ప్రయోజనం చేకూర్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ



ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో కంది, పెసర, మినుములు, అలసంద వంటి పప్పుధాన్యాలతో పాటు జొన్న, కొర్రలు, అండ్రు కొర్రలు, రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాలు, ఉలవలు, కుసుమ, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా కూరగాయల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు వినియోగించుకోవాలని వివరించారు.

ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ విజయ్ సాగర్, మండల వ్యవసాయ శాఖ అధికారి విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, ఎద్దు సత్యం, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు గుజ్జ సోమేశ్వరరావు, భూక్యా సంతోష్, తోటకూరి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, మండలంలోని పలువురు రైతులు పాల్గొన్నారు. నేడు రైతు నేస్తం 100వ వారం కార్యక్రమంవ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, జులై 28 (మంగళవారం) ఉదయం 9 గంటలకు వర్ధన్నపేట రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే రైతు నేస్తం 100వ వారం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని రైతులందరూ వీక్షించి ప్రభుత్వం అందించే సూచనలు, సలహాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.





# బీఎల్ఏలే పార్టీకి బలస్తంభాలు

## క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలి ఎమ్మెల్యే మట్టా రాగమయి

## సీఎంఆర్ఎఫ్, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ





**తల్లాడ/జులై 27 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. తల్లాడ మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన మండల బీఎల్ఏల సమీక్షా సమావేశంలో ఆమెతో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దయానంద్ విజయకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో బీఎల్ఏలు చురుకుగా పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితా నమోదు, సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్), షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాల చెక్కులను పంపిణీ చేశారు. రఘుపతి రెడ్డి కుటుంబానికి పరామర్శఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తల్లాడ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ రఘుపతి రెడ్డి దశదినకర్మ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర నాయకుడు దయానంద్ విజయకుమార్ ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ బీఎల్ఏ ఇన్‌చార్జి రాయల రాము, జిల్లా నాయకులు గోవింద శ్రీనివాసరావు, జక్కంపూడి కిషోర్, పొట్టేటి జనార్దన్‌రెడ్డి, దిరిశాల నరసింహారావు, జోసెఫ్, రమేష్, రవి, శ్రీను, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేశపురంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

## బురదలోనే డబుల్ బెడ్‌రూమ్ కాలనీ.. మూసుకుపోయిన డ్రైనేజీలు -సర్పంచ్ అందుబాటులో లేరంటూ గ్రామస్తుల ఆగ్రహం

**తల్లాడ/ జులై 27 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం కేశపురం గ్రామంలో పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రహదారులు బురద మయంగా మారగా, డ్రైనేజీలు పూడుకుపోవడంతో మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోందని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు వెళ్లే మార్గాలు బురదతో నిండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు విమర్శించారు. డ్రైనేజీల పూడికతీత చేపట్టకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు ప్రబలే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు.



బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణ మందులు పిచికారీ చేయడం వంటి చర్యలు కూడా కనిపించడం లేదని చెప్పారు. ప్రతి ఏడాది గ్రామపంచాయతీకి నిధులు విడుదలవుతున్నప్పటికీ అభివృద్ధి పనులు మాత్రం కనిపించడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరవైందని, సర్పంచ్ కూడా ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో గ్రామ సమస్యలు మరింత తీవ్రమయ్యాయని పేర్కొన్నారు.

గ్రామంలో చెత్తాచెదారం తొలగించి డ్రైనేజీల పూడికతీత చేపట్టడంతో పాటు రహదారులను మరమ్మతు చేయాలని, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా కాలువలను శుభ్రం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. అంటువ్యాధులు ప్రబలకముందే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పారిశుద్ధ్య చర్యలు చేపట్టి గ్రామాన్ని పరిశుభ్రంగా మార్చాలని కోరారు. అదేవిధంగా గ్రామంలోని ఓ దళిత మహిళ తనకు కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకునే విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై కూడా అధికారులు స్పందించి న్యాయం చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు కోరారు.



# పెద్ద పెండ్యాలలో పేట్రేగిన ఇసుక మాఫియా

**జేసీబీలతో వాగులను తోడేస్తున్న అక్రమార్కులు**

**రాత్రింబవళ్లు ఇసుక తరలింపు..**

**లోడుకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయం**

**ప్రభుత్వ ఖజానాకు గండి..**

**వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారంటున్న గ్రామస్తులు**

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జులై 27 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమీపంలోని వాగుల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే జేసీబీ యంత్రాలను వినియోగించి భారీగా ఇసుకను తవ్వి ట్రాక్టర్లు, డంపర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక మాఫియా నిర్భయంగా అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఇసుక తవ్వకాలపై కఠిన నిబంధనలు అమలు చేస్తున్నప్పటికీ కొందరు అక్రమార్కులు వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా వాగులను యథేచ్ఛగా తోడేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా జేసీబీలతో తవ్వకాలు నిర్వహిస్తూ ట్రాక్టర్లు, డంపర్లలో ఇసుకను లోడ్ చేసి కాజీపేట, హనుమకొండతో పాటు పరిసర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తుల సమాచారం ప్రకారం, ఒక్కో ఇసుక లోడును రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను విక్రయించడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ, ఇతర ఆదాయం కోల్పోతున్నదని పేర్కొన్నారు. ఒకవైపు ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుండగా, మరోవైపు వాగుల సహజ స్వరూపం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుకను విచ్చలవిడిగా తవ్వడం వల్ల వాగుల అడుగు భాగం లోతుగా మారడంతో భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే



ప్రమాదం ఉందని గ్రామ పెద్దలు చెబుతున్నారు. వర్షాకాలంలో వరదల ఉధృతి పెరిగే అవకాశం ఉండటంతో పాటు వ్యవసాయ భూములకు కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఇలాంటి అక్రమ తవ్వకాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేకుండా వాగుల్లో జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేపట్టడం వాల్టా చట్టం2002 నిబంధనలకు విరుద్ధమని



గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు. అదేవిధంగా గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టం (ఎంఎండీఆర్), తెలంగాణ మైనర్ మినరల్ కన్సెషన్ నిబంధనల ప్రకారం కూడా అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా శిక్షార్హమైన నేరమని పేర్కొంటున్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించే అవకాశం ఉందని చెబుతున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి జేసీబీలు, ట్రాక్టర్లు, డంపర్లను స్వాధీనం చేసుకుని అక్రమ ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుతూ వాగుల సహజ స్వరూపాన్ని పరిరక్షించేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని పెద్ద పెండ్యాల గ్రామస్తులు కోరుతున్నారు.

